

కథా కౌముది

# మానస సాగర మథనం - డా. యండమూరి సత్య కమలేంద్రనాథ్

**కౌముది - రచన నిర్వహించిన కథల పోటీ(2017)లో**
**సాధారణ ప్రచురణకు ఎంపికైన కథ.**

**పొత్తిళ్ళలో పసిపాప** నిద్రపోతోంది. మధ్య మధ్య ఉలిక్కిపడుతోంది, నవ్వుకుంటోంది, తుళ్ళి పడుతోంది, చేతులూ కాళ్ళూ కొట్టుకుంటోంది. పసి హృదయంలో ఏ కలలు వస్తున్నాయో ఎవరికీ తెలియదు.

కూతురివైపే చూస్తోంది సుమతి. సంతానం కలిగిందనే ఆనందం కంటే పుట్టిన కూతురు భవిష్యత్తు ఏమవుతుందోననే భయం, తనలాగే అవ్వవలసి వస్తుందేమోననే ఆందోళన మనస్సులో ప్రళయం రేపుతోంది.

వీధిలోని మహిళలంతా వస్తున్నారు. పసిపాపని చూసి వెళుతున్నారు. అందరి దృష్టిలో ఒకే ఆలోచన "మరో ఆడపిల్ల - ఈ వీధిలో మరో అంగడి బొమ్మ జన్మించింది."

కూతురు తడబడే అడుగులతో, పడుతూ లేస్తూ నడుస్తోంది. వచ్చీరాని మాటలతో ముద్దుముద్దుగా మాట్లాడుతోంది. ఆ యింట అందరికీ పాప వల్లే సందడి, కాలక్షేపం. వయస్సు పెరిగి మాటలు నేర్చి యింట తిరుగుతూ వుంటే, కూతురి వయస్సు పెరుగుతున్నందుకు సుమతి మనస్సులో బెంగ పెరుగుతోంది. ఆ యింట వాతావరణంలో పెరిగితే భవిష్యత్తు ఎలా వుంటుందో తనకు అనుభవమే. అదే పాప విషయంలో భయపెడుతోంది.

సాయంత్రం వీధి గుమ్మంలో నిలబడి వుంది. పాప నిద్రపోతోంది. పదిరోజుల క్రితం జరిగిన సంఘటన గురించి ఆలోచిస్తోంది సావిత్రి.

ఆ రోజు రాత్రి ఏడుగంటలకి నాయకురాలు పిలిచి - తనని, రమని అడ్రసు చెప్పి వెళ్ళి రాత్రి గడిపి రమ్మంది. ఇద్దరూ బయలుదేరి వెళుతూవుండగా పెద్ద వయసుగల ముసలావిడనీ, యిద్దరు చిన్న పిల్లలనీ కూడా తీసుకుని వెళ్ళమంది. వాళ్ళంతా తమ కూడా ఎందుకో అర్థంకాలేదు. తెల్లవారుఝామున తిరిగి వస్తూవుండగా పోలీసు అడ్డగించాడు. ఆ సమయంలో ముసలావిడ సమయస్ఫూర్తితో తనని, రమని కూతుళ్ళని, పిల్లలు మనవలు అని చెప్పింది. పోలీసు మారుమాట్లాడలేదు. తనకి మాత్రం ఒళ్ళంతా వణుకు, గుండెల్లో దడ. ఆ రోజున పోలీసు స్టేషన్‌కి తీసుకుని వెళ్ళి విచారించి వుంటే మరుసటిరోజు పాప తల్లి ఎక్కడ వుందని యిల్లంతా వెతుక్కునేది. ఆ తర్వాత దాని జీవితం ఏమిటి?

చీకటిపడేవేళ అయింది సుమతి ఆలోచనల్లో వుండగా సందు చివరగా తన వయస్సుగల స్త్రీ నడచి రావటం కనిపించింది. ఆ సమయంలో ఏ నూతన స్త్రీ, ఆ సందులోకి రావటానికి సాహసం చెయ్యదు. వస్తే సమాజం ఆ స్త్రీని కూడా అంగడి బొమ్మగానే పరిగణిస్తుంది.

నడచి దగ్గరకు వచ్చే కొద్దీ ఎక్కడో చూసిన మొహంలా అనిపించి పరిశీలనగా చూసింది. దగ్గరకు రాగానే గుర్తుపట్టింది. పలకరించటానికి సంశయించింది. మౌనంగా వుండిపోయింది.

గుమ్మం ముందు నిలబడి "నువ్వు సుమతివే కదూ" అంది ఆ స్త్రీ.

మెట్లు దిగి "సుధా! నువ్వా ఎలావున్నావ్?" అంటూ ఎన్నో ప్రశ్నలు వెంటవెంటనే అడిగింది సుమతి.

"బయటే నిలబడి మాట్లాడతావా? ఇంట్లోకి రానీయవా?" అంది సుధ. "సుధా! నువ్వు యీ వీధిలోకి రావటమే ఊహించలేదు. పైగా యింట్లోకి వస్తానంటున్నావ్" అంటూ లోపలికి నడిచింది.

సుధ నవ్వుతూ "సుమతీ ప్రస్తుతం నేను స్వచ్ఛంద సేవా సంఘసంస్కర్తని తెలుసా! రా అంటూ గడపదాటి లోపలికి వచ్చి కుర్చీలో కూర్చుని "ప్రస్తుతం ఏం చేస్తున్నావ్?" అంది.

"ఏవుంది? ఈ వీధిలోని బాగోతం నీకు తెలియనిది కాదు"

"ఎంతవరకు చదువుకున్నావు?"

"ఎనిమిదివరకు"

"అంటే నేను వూరు వదిలివెళ్ళిన తర్వాత చదువునేశావా?" అంది సుధ.

నిట్టూరుస్తూ "సుధా! నాలాంటి వాళ్ళకి చదువు మీద ఎంత యిష్టం వున్నా, ఈ వాతవరణంలో చదువుకోవడం పడదు. వయసు పెరిగి, శారీరక మార్పులు వచ్చేసరికి అమ్మ బడికి పంపటం మానేసింది. ఏడ్చాను తిండి మానేశాను. అయినా అమ్మ తనపట్టు విడవలేదు. మనకు చదువు లాభంలేదు, నువ్వు పై చదువులకి వెళ్ళినా సమాజంలో నీ గుర్తింపు మారదు. అందరూ ఆశగా కళ్ళతోనే విపరీతార్థాలు వచ్చేలా చూస్తారు. తర్వాత చేతులు వేస్తారు. సూటీపోటీ మాటలతో నీ మనస్సుకి తూట్లు పొడుస్తారు. అవి నువ్వు వినలేవు. మన జీవితాలు యింతే. ఈ వీధిలో అందరం అంగడి బొమ్మలమే. వయసు వున్నంతకాలం సాగుతుంది. ఆ తర్వాత అంతా భగవంతుడి దయ" అంది అమ్మ నేను మరింక మాట్లాడలేదు.

ఇంట్లోనే వుండి ఎన్నో పుస్తకాలు చదివాను. ఆ తర్వాత షరామామూలే. ఎంతోమంది పురుషులు స్త్రీని జనని, ధరిత్రితో పోలుస్తారు. అందుకే కాబోలు అంతమందిని భరించేశక్తిని యిచ్చాడు భగవంతుడు. ప్రతీమనిషి అవసరం తీరేవరకు రంభ, ఊర్వశి అని పొగిడేవారే. ఆ తర్వాత కనపడినా, మొహం చాటు చేసుకుని వెళ్ళిపోతారే కానీ పలకరించరు. మనం పలకరిస్తే అదేదో తప్పుగా భావించి మొహం చిట్లించి చూస్తారు. ఒకే వ్యక్తి నా జీవితంలో ప్రవేశించాడు. ఎంతో చెప్పాడు. ఆశపడ్డాను. చాలాకాలం కలిసివున్నాం. తన దగ్గర వున్నంతకాలం మనసా వాచా పతివ్రతలానే వున్నాను. అతనితో వుండగానే గర్భవతినయ్యాను, ఎన్నో కలలు కన్నాను ఇద్దరం కలసి పాపతో ఆడుకోవడం అల్లరి చేయటం, పాపని ఎత్తుకుని చేతులు మార్చుకుంటూ అలా నడుచుకుంటూ వెళ్ళటం ఎంత ఆనందంగా ఉంటుందోనని ఆశపడ్డాను. ఆ మనిషి ఒకరోజు కనపడకుండా పోయాడు. తిరిగి పక్షి గూటికి చేరిపోయింది." అని సుమతి చెపుతూ వుండగా "అమ్మా" అంటూ సుమతి కూతురు తడబడే వడివడి అడుగులతో వచ్చి సుమతి కుచ్చెళ్ళు పట్టుకుంది. బొద్దుగా వుంది. నవ్వుతోంది, వచ్చీరాని మాటలు పలుకుతోంది. పాపని చూడగానే సుధకి ముచ్చటేసింది. ఎత్తుకుని ముద్దాడింది.

"సుమతీ పాపని ఎలా పెంచుదామనుకుంటున్నావ్?" అడిగింది సుధ

"సుధా! పాపని స్కూల్లో చేర్చగానే తండ్రి ఎవరని అడుగుతారు. ఎవరి పేరు రాయాలి? స్వార్ధ రహిత తల్లి పిల్లలకి తండ్రితో గుర్తింపు వుండాలని కోరుకుంటుంది. కానీ తండ్రి ఎంత స్వార్ధపరుడంటావ్? మా దగ్గర తన కోరిక తీరేవరకు నా పిల్లలంటాడు ఆ తర్వాత ఎవరి పిల్లలు అంటాడు. అదే పరిస్థితి నేను ఎదుర్కోబోతున్నాను.

పాప భవిష్యత్తు తలచుకుంటే అంతా అగమ్యగోచరం. నా తండ్రి ఎవరు అని అడిగితే ఏం చెప్పాలి. రేపు నా జీవితం ఏమిటో తెలిస్తే నా అసమర్ధతకి, చేసే వృత్తికి చూసే చూపు ఎంత ఏవగింపుగా వుంటుందో? ఆలోచిస్తూంటే మనసంతా కకావికలమైపోతూ వుంటుంది."

"ఏం చేద్దామనుకుంటున్నావ్?"

"వయస్సు వున్నంతకాలం జరుగుతుంది. ఆ పైన భగవంతుడి దయ. ఎంతకాలం యిలా వుంటామో కూడా తెలియదు. ఎన్ని జాగ్రత్తలు తీసుకున్నా ప్రస్తుతం వున్న జబ్బులు గురించి నీకు చెప్పనవసరంలేదు. పాపని ఈ పాపపంకిలంలోకి రాకుండా చేయడానికి శతవిధాల ప్రయత్నిస్తాను. అమ్మలా మాత్రం చెయ్యను" అంది సుమతి స్థిరంగా.

"పాపని వదిలి ఉండగలవా?"

"అంటే"

"నాతో పంపిచేయి నేను స్వచ్ఛంద సేవా సంస్థలో పని చేస్తున్నానని చెప్పానుకదా! పాప భవిష్యత్తు బాధ్యత నేను వహిస్తాను. మాకు ఈ ఊళ్ళో అనాధ శరణాలయం వుంది. నీకు ఎప్పుడైనా చూడాలనిపిస్తే చూపిస్తాను. అంతవరకు నువ్వు రావద్దు" అంది సుధ.

క్షణం మౌనం వహించింది సుమతి. ఆ క్షణంలోనే నిర్ణయం తీసుకుంది. ఆ నిర్ణయానికి కళ్ళలో నీళ్ళు ఉబికి వచ్చాయి. కొంగుతో తుడుచుకుంది. ఎదురుగా పాప చీర పట్టిలాగుతోంది ఎత్తుకోమంటూ చేతులు చాచింది. పాపని ఎత్తుకుని "సుధా! నీ కూడా తీసుకుని వెళ్ళిపో. నాకు పిల్లలే లేరనుకుంటాను ఎప్పుడైనా దూరం నుంచి చూస్తానేమో కానీ, నా ఛాయ కూడా దానిమీద పడనివ్వను. కన్నతల్లిని అనే ఆలోచనే సమాధి చేస్తాను. నా కూతురి భవిష్యత్తుకంటే నాక్కావల్సింది ఏముంది? ఈ సమాజంలో నాకున్న విలువేమిటో నాకు తెలుసు. నా కూతురికి ఏ విధమైన గుర్తింపువుంటుందో నీకు చెప్పఖ్ఖర్లేదు. అందుకే నా కూతురని ఎవరికీ చెప్పకు. "మనస్సులో ఎంత దుఃఖ వున్నా, మొహం మీద నవ్వుని అలంకరించుకుని వచ్చేవ్యక్తులతో గడపాలి. శారీరకంగా ఎన్ని బాధలు వున్నా, ఆ క్షణం ఓర్చుకుని అంగీకరించాలి తప్పదు. దానిముందు పాపని నీకప్ప చెప్పటం చాలా తేలికయిన విషయం. రేపు నేను జీవితం ముగించాక ఏ దరికి చేరతానో తెలియదు. నాకే కాదు ఎవరికీ తెలియదు. కానీ జీవితపు నీడలు భూమ్మీద వుంటాయి. ఆ నీడలు నా కూతురి మీద పడితే పరిస్థితి ఏమిటి? అందుకే దయచేసి నా గురించి తనకు చెప్పకు, నా ఛాయలో తన జీవితం వుండేదని ఏనాడూ బయట పెట్టక" అంది.

"మాట్లాడినంత సులువుగా తల్లిగా బంధాన్ని వదులుకోగలవా? నిరంతరం నీ కళ్ళలో పాప మెదులుతూనే వుంటుందికదా, సుమతీ" అంది సుధ.

"నువ్వు అడిగిన వెంటనే నీ మాటల్లో నాకు పాప భవిష్యత్తు కిరణం గోచరించింది. సుధా! ప్రేమ శాశ్వతం. హృదయానికి దగ్గరగా తీసుకుని మనసారా నీకు నేనున్నాను అనే వ్యక్తి నాకు జీవితంలో లభించలేదు. ఇక లభిస్తాడని ఆశించటం దురాశ. ఈ స్థితి నా కూతురికి రాకూడదని ఈ నిర్ణయం తీసుకున్నాను. పాపని తీసుకుని వెళ్ళిపో" అంటూ పాపని సుధ చేతుల్లో పెట్టింది. చేతుల్లో పెట్టగానే మనస్సులో రేగుతున్న సంఘర్షణని ఆపుకోలేకపోయింది. రోదించటం మొదలుపెట్టింది. కొంత సమయానికి తేరుకుంది. "ఆర్ధికంగా పాప బాధ్యత నేను వహిస్తాను. సమాజంలో ఎదిగే బాధ్యత నువ్వు తీసుకో" అంది.

"అవన్నీ నాకు వదిలేయి" అంది సుధ.

సుమతి అద్దంలో తలదువ్వుకుంటూ చూసుకుంది. తెల్లవెంట్రుకలు కనపడ్డాయి. రంగేసుకోవాలి తప్పదు. ఇలా వుంటే వచ్చే విటులు కూడా రారు. వయస్సు పెరుగుతోంది. మరికొంత కాలంపోతే ఎలా బ్రతకాలి? ఆ ఆలోచన రాగానే భయం వేసింది. తన బాధ్యత వహించటానికి తోడు ఎవరూ లేరుకదా అనిపించింది. కూతురు గుర్తుకు వచ్చింది. ఎలా వుందో ఏమిటో? చూసి పన్నెండు సంవత్సరాలయిపోయింది. ఈ కాలంలో ఎంత చూడాలనిపించినా గుండె దిటవు చేసుకుని దూరంగానే వుంది. రాత్రిళ్ళు గుర్తుకు వచ్చినా, కన్నీళ్ళు తలగడమీద పడేవేకానీ మనస్సు రాయిలా చేసుకోవడానికి ప్రయత్నించింది. ఈ సమాజంలో కూతురుకి ఒక స్థానాన్ని ఏర్పరచటానికి తను ఏమైనా ఫర్లేదు అని ఆలోచించింది. తనకి ఈ ఇల్లే స్వర్గం, నరకం. పైకి వెళ్ళిన తర్వాత చూస్తే తను ఏం సాధించింది అని చూసుకుంటే, మిగిలేది అసమర్ధ జీవనానికి ఏ రోజుకి ఆ రోజు పడే ప్రాకులాట, చిరిగిన గుడ్డపీలికలాంటి జీవితం తనది. ఆలోచిస్తుండగా గుమ్మం దగ్గర అలికిడి అయినట్లు అనిపించి గుమ్మం వైపు చూసింది.

ఎదురుగా గుమ్మంలో సుధ కనపడింది.

"సుధా! ఈ సమయంలో అనుకోని అతిధిలా వచ్చావే. ఏమిటి విషయం?" అంది.

"ఏం చేస్తున్నావు సుమతీ" అంది సుధ.

"సాయంత్రం అవుతోంది కదా షరామామూలే అద్దంలో నా ముసలితనపు ఛాయలు చూసుకుంటూ భవిష్యత్తు గురించి ఆలోచిస్తూవుంటే పాప గుర్తుకు వచ్చింది. ఇంతలో నువ్వు వచ్చావు" అంది.

"సుమతీ నీ కూతురిని వాగ్దేవి స్కూల్లో చదివిస్తున్నానని నీకు ఒక్కదానికే చెప్పాను. ఆ విషయం నువ్వు ఎవరికైనా చెప్పావా?"

"లేదే అయినా చెప్పాల్సిన అవసరం ఏముంది? దాని జీవితం బాగుపడితే నాకంతే చాలు. పదవతరగతి కాగానే ఇంటర్మీడియట్‌లో ఎక్కడ జాయిన్ చెయ్యాలో ఎలా చేస్తే బాగుంటుందో నువ్వే నిర్ణయించు. దానికి తల్లి, తండ్రి, మార్గదర్శివి నువ్వే."

"బాగా ఆలోచించు. ఎందుకంటే నీ పాప ఎవరో స్కూలు యాజమాన్యానికి తెలిసిపోయింది. ప్రభుత్వంలో ప్రముఖ ఉద్యోగి, బహుశా ఆర్.డీ.ఓ అనుకుంటా, పాపలాంటి వాళ్ళు ఆ బడిలో వుంటే మిగిలిన పిల్లల మీద ఆ ప్రభావం పడుతుందని, అనాధలని జాయిన్ చేసుకునే ముందు సాధ్యమయినంత వరకు వారి చరిత్ర తెలుసుకోవాలని గట్టిగా చెప్పాడని నా అనుమానం" అంది సుధ.

"ఏ డిపార్టుమెంటు అన్నావు" అడిగింది సుమతి.

"ఆర్.డీ.ఓ" అంది సుధ.

"గుర్తుకొస్తోంది. ఆరు నెలల క్రితం రాజారావు నా దగ్గరకు వచ్చాడు. నేను చెప్పాను గుర్తువుందో లేదో నేను వయస్సులో వుండేటప్పుడు నన్ను ఒక వ్యక్తి దగ్గరకు తీసాడు. తనతోపాటే వుండి మరెవరినీ దరిచేరకూడదని అన్నాడు. చాలా ఆశపడ్డాను. జీవితం స్థిరపడుతుందని నమ్మాను. ఆ సమయంలోనే గర్భవతినయ్యాను. ఆ తర్వాత కనపడలేదు. బదిలీ అయిపోయి వెళ్ళిపోయాడని తెలిసింది. అప్పట్లో డిప్యూటీ తహశీల్దారుగా చేస్తుండేవాడు. అతనే రాజారావు. ఆ తర్వాత ప్రమోషన్ వచ్చిందని తెలిసింది. ఆ క్రమంలో ఆర్డీవో అయ్యాడేమో, ఈ ఊరికి రాగానే కలిసాడు. అతనితో ఉన్నప్పుడే గర్భవతినయ్యానని తనకి తెలుసు. అందుకే కొడుకా, కూతురా అని అడిగాడు. చెప్పాను.

ఏం చేస్తుందని అడిగాడు, తన కూతురే కదా అని అనుకున్నానేకానీ దాని భవిష్యత్తు ఇలా విషపూరితం చేస్తాడని అంత నీచ మనస్కుడని ఊహించలేదు" అంది సుమతి.

"సరే ఆ విషయం నాకు వదిలేయి. పాప పరీక్షలు రాసేలా చూస్తాను. మరెవ్వరి దగ్గరా ఈ ప్రస్తక్తి తీసుకుని రాకు. అమ్మాయి బాగా చదువుతోంది. పదవతరగతి పరీక్షలయింతర్వాత ఏం చెయ్యాలో ఆలోచిద్దాం. యాజమాన్యంతో నేను మాట్లాడతాను. నువ్వు కంగారుపడకు" అని సుధ వెళ్ళిపోయింది.

ఆ రాత్రంతా నిద్రలేక యిదే విషయం ఆలోచిస్తూ కుమిలిపోయింది సుమతి.

సాయంత్రం ఆరుగంటలవుతోంది. మలిసంధ్యలో వీచే గాలులతో వాతావరణం ఆహ్లాదంగా వుంది. స్కూలు మైదానంలో అలంకరించబడిన వేదిక ఆస్కూలు స్థాయిని ప్రతిబింబింపచేస్తోంది. సుమారు వెయ్యిమంది పిల్లలు వారి తల్లిదండ్రులతో మైదానంలో సుఖాసీనులైవున్నారు. పిల్లలంతా మూడు సంవత్సరాలనుండి పదిహేను సంవత్సరాలలోపు వయస్సుగలవారే. చిన్న పిల్లలు మైదానంలో కేరింతలు కొడుతూ ఆడుతూ వుంటే, కొంతమంది విద్యార్థులు వేదిక ప్రక్కగా తాము వేదికమీద చెయ్యబోయే కార్యక్రమాలు రిహార్సల్స్ చేసుకుంటున్నారు.

ఆ కుర్చీలలో మూలగా కూర్చుని వుంది సుమతి. జరగబోయే కార్యక్రమంలో తన కూతురికి కూడా పాత్రవుందని గర్వపడుతోంది. కానీ తన కూతురే అని ఎలుగెత్తి చెప్పుకోలేని స్థితిలో వుంది. ఆరునెలల క్రితం సుధరావడమూ, పాప గురించి అడగడమూ, రాజారావు చేసిన నీచమైన పని గుర్తుకు వచ్చింది. ఆ ఆలోచనల్లో వుండగా సుధ వచ్చింది.

"సుమతీ నీ కూతురు ఫలానీ అని తెలిసిపోయిన తర్వాత పదవతరగతి పరీక్షలయేంత వరకు పావని స్కూల్లోనే వుంచండి. మధ్యలో పంపించేస్తే ఆ పాప భవిష్యత్తు నాశనం చేసినవాళ్ళం అవుతాం. దయచేసి ఆ పరిస్థితి తీసుకుని రావద్దు అని చెప్పి ఒప్పించాను. ఈ విషయం మరెవ్వరికీ తెలియదు" అని చెప్పి వెళ్ళిపోయింది.

ముఖ్య అతిథిగా ఆర్.డి.ఓ రాజారావుని, స్కూలు చైర్మన్‌ని స్కూల్ డైరెక్టర్‌ని వేదిక నలంకరించవలసినదిగా హెడ్‌మాస్టారు పిలిచారు.

స్కూల్ చైర్మన్ మాట్లాడుతూ "కొన్ని సంఘటనలు జీవితంలో ఎలా ఎందుకు జరుగుతాయి? వాటి ప్రభావం ఎలా వుండబోతుంది? అనేది ఊహించలేము. కానీ మనం నిస్వార్థంగా చేసే పనులవల్ల ఒకొక్కసారి అనుకోకుండా సత్ఫలితాలు లభిస్తాయి. అలాంటి సంఘటన మన స్కూల్లో జరిగింది. సుధ, సాంఘిక సేవా కార్యకర్త, పన్నెండు సంవత్సరాల క్రితం అనాథంటూ పాపని తీసుకుని వచ్చి, స్కూల్లో జాయిన్ చేసుకోమని, ఆ పాప పూర్తి బాధ్యత తానే వహిస్తానని అడిగింది. మొదట్లో సందేహించినా పాపకి చదువు నేర్పటంలో మాకొచ్చే నష్టంలేదనుకుని, ఉచితంగా జాయిన్ చేసుకుని నేటి వరకు మా హాస్టల్‌లోనే వుంచుకున్నాం. "మేము ఆ పాపకి చేసిన సహాయం కంటే నేడు ఆ పాప మేము గర్వపడేలా స్కూలుకి తీసుకొచ్చిన పేరు ప్రతిష్టలు ఎక్కువ. ఆ విధంగా ఆ పాప మా ఋణం తీర్చుకుంది" అంతా సుధ వైపు చూసారు.

"సుధా! విద్యాభారతిని తీసుకురామ్మా" అన్నాడు. సుధ విద్యాభారతిని వేదిక మీదకు తీసుకుని వచ్చింది. చైర్మన్ ఆ పాపని దగ్గరకు తీసుకుని "ఈ పాప పదవతరగతి పరీక్షల్లో రాష్ట్రస్థాయిలో మొదటి స్థానం సంపాదించింది." అని మెడలో గోల్డ్‌మెడల్ వేసి "మా స్కూలు యాజమాన్యం తరపున విద్యాభారతికి ఇంటర్మీడియట్ చదవడానికయ్యే ఖర్చు మేమే భరిస్తామనీ, ఈ పాపకి మంచి భవిష్యత్తు కలగాలనీ కోరుతూ, ఈ పాపని మా బడిలో చేర్చినందుకు సుధకు ధన్యవాదాలు తెలుపుతున్నాను" అని కూర్చున్నాడు.

ప్రకటన వినేసరికి ఉద్వేగంతో సుమతి వెక్కి వెక్కి ఏడవటం మొదలుపెట్టింది. ప్రక్కన వాళ్ళందరూ సుమతి వంక చూడటం మొదలుపెట్టారు. తమాయించుకుని, కొంగుతో కన్నీటిని తుడుచుకుంది. ఆ కొంగు నిండా అక్కడక్కడా చేత్తో కొట్టిన చిరుగులు ఉన్నాయి.

వేదిక మీద ఆర్.డి.ఓ రాజారావు మాట్లాడుతూ "తల్లి గర్భం దాల్చి నవమోసాలు మోసి కన్న తర్వాత అనాధలా వదిలేయడానికి ఎన్నో కారణాలు - ఆర్ధికంగా కానీ, వయస్సు ఆకర్షణకిలోనై సమాజానికి భయపడి కానీ, తనున్న వాతావరణంలో బిడ్డ భవిష్యత్తు ఏ విధంగా వుంటుందో అనే భయంవల్ల కానీ ఏదైనా కావచ్చు. ఆ సమయంలో తల్లిపడే వేదన, క్షోభ ఎలా వుంటుందనేది భారతంలో కుంతి కర్ణుడిని నీట వదిలేసిన సంఘటన "కుంతీ విలాపం" చదివితే తెలుస్తుంది. కర్ణుడికి దుర్యోధనుడి ఆసరా దొరికితే విద్యాభారతికి సుధ ఆసరా దొరికింది. ఈ పాప తనకున్న ప్రజ్ఞ, కృషి, పట్టుదల, ఆశయాలతో మైలురాళ్ళు సాధిస్తోంది. భవిష్యత్తులో మరెన్నో మెట్లు ఎక్కాలని, ఆశీర్వదిస్తూ తనకి చదువుకోవడానికి కావల్సిన సహాయ, సహకారాలు అందిస్తానని సభాముఖంగా తెలియజేస్తున్నాను." అన్నాడు.

ఆహుతుల కరతాళధ్వనులు మిన్నుముట్టాయి.

రాజారావు ప్రసంగం విన్న సుమతి విస్తుబోయింది. కన్నకూతుర్ని బడిలో నుంచి వెలివేయడానికి ప్రయత్నించినవాడు పరపతి కోసం చేసిన ప్రకటనలో ఎంత స్వార్థం వుందో గుర్తుంచింది. నిర్దాక్షిణ్యంగా బడిలో నుంచి పంపించి వెయ్యడానికి ప్రయత్నించిన వ్యక్తి, రాబోయే కాలంలో ఏం చేస్తాడోననే ఊహే భయం విహ్వారాలుని చేసింది. తన కూతురికోసం ఎన్ని అడ్డంకులు వచ్చినా ఎదురీదాలని మనస్సులో స్థిరనిర్ణయం తీసుకుంది.

వినోద కార్యక్రమాలు పూర్తయేసరికి రాత్రి తొమ్మిది గంటలయింది. సుధ సుమతి దగ్గరకు వచ్చి "సుమతీ! పాపని తీసుకుని రానా! మాట్లాడతావా?" అంది.

"వద్దు. బాగా చదువుతోంది. వృద్ధిలోకి వస్తే నాకదే పదివేలు. వేదిక మీద చూశాను కదా అది చాలు. 'విద్యాభారతి' పేరు బాగా పెట్టావు. ఇదంతా నీ చలవే" అంటూ సుధ చేతులు తన చేతుల్లోకి తీసుకుని కళ్ళకద్దుకుంది.

సుమతి చీకట్లో యింటివైపు నడుస్తోంది. ప్రక్కనుంచి కారువెళ్ళి చీకట్లోనే రోడ్డు ప్రక్కగా ఆగింది. డోర్ తెరిచి రాజారావు క్రిందికి దిగి నిలబడ్డాడు. సుమతి దగ్గరకురాగానే "సుమతీ! నన్ను క్షమించు" అన్నాడు.

సుమతి మాట్లాడలేదు తలదించుకునే వుంది.

"కూతుర్ని దూరంగా వుంచి, సంవత్సరాల తరబడి చూడనైనా చూడకుండా వుండి, దాని భవిష్యత్తు కోసం నువ్వు తీసుకున్న ధృఢ నిర్ణయానికి మనసారా అభినందిస్తున్నా. ఎంతకాదనుకున్నా పాప మనిద్దరి పాప. నా ప్రతిష్ఠకి భంగం కలుగుతుందేమోనని యాజమాన్యంతో నేను మాట్లాడింది తప్పే. నా మాట మీద యాజమాన్యం పాపని వెలివేసి ఉంటే నిష్కారణంగా ఒక ఆడపిల్ల జీవితం నాశనం అయిపోయి ఉండేది. కానీ యాజమాన్యానికి పాపమీద ఉన్న నమ్మకానికి జోహార్లు. ఇకమీదట యిలాంటి సంఘటన జరగనివ్వను. నాకు యీనాటికీ పిల్లలు లేరు. పాప నా కూతురని చెప్పుకోగలిగే స్థితిలో నేను లేను. నువ్వు ఏనాటికైనా తల్లిని నేనని చెప్పుకోగలవేమో కానీ, సమాజానికి చెప్పగలిగే ధైర్యం నాకులేదు. క్షమించు. పాపకి చదువు విషయంలో ఎంత ఖర్చు అయినా సరే వెనుకాడక. నేను యిదివరకులా మాట్లాడటంలేదు. ఆనాటి బుద్ధివేరు, ఈనాటి బుద్ధి వేరు. ఈ రోజు జరిగిన సంఘటన నా కళ్ళు తెరిపించింది. పాప జీవితం కోసం నువ్వు అనుభవించిన నరకయాతన నా మనస్సుని శూలంలా తాకింది. పాప జాగ్రత్త. ఈ మురికి కూపంలోంచి ఊరు వదిలి వెళ్ళిపో. అవసరమయితే సుధ సహాయం తీసుకో. ఆర్ధిక విషయాలు నాకొదిలేయి. ఏదో ఒకరోజు జీవితం ముగిసే లోపల పాపని దగ్గరకు తీసుకుని నీ నాన్నని నేనే అని చెప్పి క్షమార్పణ కోరతాను" అంటూ సుమతి చేతులు పట్టుకున్నాడు" రాజారావు.

తల ఎత్తి సుమతి రాజారావు కళ్ళలోకి చూసింది. ఆ చూపులు నమ్మదగినవిగానే వున్నాయి. రాజారావు చేతులు గట్టిగా పట్టుకుంది. "ఈ జీవితానికి యిది చాలు" అన్నట్లుగా.

Click here to share your comments on this story